# 13
# సందిగ్ధ

*అరుణక్క చాలా నేర్పించింది. తను కూడా ఒక మనిషేనన్న సంగతి అరుణక్క వద్దే నేర్చుకుంది. అయినా ఎక్కడో ఏదో చిన్న మెలిక. ఎంతో బాగ చూసుకునే అరుణక్క... ఎన్నెన్నో విషయాలు తెలిసిన అరుణక్క...*

గుక్క తిప్పుకోనివ్వని ఉక్కపోతలో నుండి దిగ్గున లేచి కూర్చుంది చంద్రిక. ఆ కటిక చీకట్లో తానెక్కడుందో తెలుసుకోవడానికి రెండు సెకన్లు పట్టింది.

తను... తను... తమ రెండు నిట్రాళ్ళ గుడిసెలోనే వుంది. ఖచ్చితంగా అక్కడే వుంది.

ఇక్కడ టక్కున వెయ్యడానికి లైటూ లేదు. చప్పున చూడ్డానికి టైమూ లేదు. బహుశా తెల్లవారడానికింకా రెండు గంటల సమయ ముందేమో.... తను మాత్రం గంట ముందే లేవాల.

వాకిలంతా ఊడ్చి పేడ కళ్ళాపు జల్లి ముగ్గులు తీర్చాల.

అరమైలు దూరాన వున్న బోరింగు వద్ద నుండి నీళ్ళు మోసుకొచ్చి తొట్టి నింపాల. యింట్లో బానకి పొయ్యాల.

ఊళ్ళో బావులన్నీ ఎండిపొయ్యాయి. మాలాడకయినా, మాదిగాడకయినా ఈ బోరింగు నీళ్ళే గతి. బోరింగులెయబట్టి బావు లెండిపోయాయో, బావులెండి పోబట్టి బోరింగు లేశారో కానీ కొట్టి కొట్టి గూళ్ళూ,

గుండెనొప్పి పుడ్తుండాయి. అరుణక్కోళ్ళింట్లో ఏ పక్కబట్టినా కొళాయిలు. బోర్లు కొట్టేపనే లేదు. తను ఒల్లికి పోసుకోవాలన్నా, గుడ్డలు తుక్కోవాలన్నా నీళ్ళే నీళ్ళు. ఈ మాదిరిగా నీళ్ళు చూసిచూసి వాడుకోవల్సిన పనేలేదు.

అమ్మా, నాయినా ఆరోగంటకంతా బర్రెలు తోలుకుని అడవికి పోవాల. ఊరోళ్ళంతా మేపుకూలికి, తోలిన పశువులయ్యి... దూడల పాలికొచ్చిన రెండు మూడు దూడలు తప్ప సొంత గొడ్లేమీ లేవు తమకి.

"పసులు గాయడమంటే అరుణక్కోళ్ళింట్లో ఫ్యానుకింద కూచుని చీరలు కుట్టి నట్లుకాదు" అంటాడు నాయిన.

ఆ బర్రెలు అట్ల పరిగిస్తే... ఈ దూడలు యిట్ట పరిగిస్తాయి... మరీ ఆ సిమ్రాని (సిమ్రాన్) దూడయితే చెప్పిన మాటేయినదు, గెంతులేస్తా ఎల్లిపోతాది. వాటిని మలెయ్యాలంటే అడివంతా పరుగుల్దియ్యాల.

ఎండకి మాడతా, చెమటలు కారతా ఆ పక్కకీ, ఈ పక్కకీ పరిగెత్తే అమ్మా నాయిన్ని చూస్తే దిగులేస్తాది.

సాయింత్రం యింటికొచ్చేతలికి చావు జంపులయిపోతాది వోళ్ళపని. అప్పుడొచ్చి పొయ్యి మంటేసి నీళ్ళుగాసుకుని పోసుకుని... కూడొండుకోవాలంటే వల్లగావడం లేదని తనని తోడుకొచ్చేసినారు అమ్మా, నాయినా. చినమ్మి ఈ పనికిమాలిన పనిగాని చేయకుండా వుంటే తనక్కడే వుండేది. అరుణక్క పిల్లల్తో పాటు ఏ.సి. రూములో పడుకునేది.

'గుంయ్యి'మంటోన్న దోమల సంగీతాన్ని కొట్టార్పుతూ "ష్... హబ్బ" అనుకుంది చంద్రిక. ఈ ఉక్కపోతను భరించడం సాధ్యంకావడం లేదు చంద్రికకి. బయటకెల్దామంటే...

"వొగిసు పిల్లవి బయటేంది పొణుకునేది" అంటాడు నాయిన. నాయిన అన్నిటికీ కసురుకుంటాడు.

'నాన్నా' అని పిలిస్తే 'ఆ నాజూకేందమ్మే... నాయినా అని పిలవలేవా?' అంటాడు.

'డస్సు లేసుకోవద్దీడ... పావడా, పైటా ఏసుకో లేదంటే అరువుగా మీ అమ్మ చీర కట్టుకో' అంటాడు.

గుడ్డలుతుక్కోవడానికి 'రిన్' సబ్బు కావాలంటే ఉరుమురిమి చూస్తాడు. ఒల్లికి పోసుకోవడానికి లైఫ్‌బాయిని మించింది లేదంటాడు.

ఎర్ర సబ్బు... ఎర్రబస్సు... ఎర్రమట్టిలో పని...

మట్టి పిసుక్కోవడం... పేడ జవరడం... బర్రెలు కడగడం, పాలు దియ్యడం... అంతకంటే వేరే లోకమే లేదనుకుంటాడు.

తనేదయినా చెప్పబోతే

"టవున్లో వుండొచ్చి ఏవీ ఒళ్ళు తెలీడం లేదమ్మికి," అంటాడు.

అమ్మనయితే కుడిపైట మాన్పించి, ఎడంపైట వెయ్యించాలని నెలరోజులు ఉపవాసాలుంది తను. ఏమీ తినకుండా బిగుసుకుని కూచుంటే చావబాది ఒక్కపొద్దులు

మాన్పించిందే తప్ప తన పద్ధతి మార్చుకోలేదు. అరుణక్క ఎంత స్టయిలుగా కట్టు కుంటాది చీర.

ప్చ్... తరతరాలుగా వస్తోన్న పద్ధతుల్ని మార్చుకోవడానికి అమ్మా, నాయినా యిష్టపడరు. తను చెప్పినా వినరు.

యిక్కడ వీళ్ళంతా కేవలం శరీరాల కోసం, శరీరాలతో బతుకుతున్నారు. వీళ్ళందరి నుండీ వేరుగా తనక్కొంత ఆలోచన వుంది. ఎలా జీవించాలో తెలుస్తోంది. అదొక్కటే వీళ్ళకూ, తనకూ తేడా.

వాకిట్లోని వేపమాను గాలితో కలిసి పాటలు పాడుతోంది.

మూసేసిన ఈ మట్టిగోడలు దాటి లోపలికి రావడానికి గాలికి వీలులేదు. బయటికెళ్ళి గాలి పీల్చుకోవడానికి తన కవకాశంలేదు.

తనకేమో బయట వేపచెట్టు గాల్లో పడుకుని ఆకాశంలో చుక్కల్ని లెక్కబెట్టాలని యిష్టంగా వుంటుంది. పిల్లలకోడి... పట్టెమంచం... ధ్రువతార... అన్నీ ఎతికెతికి చూసేది చిన్నప్పుడు ఆరుబయట పడుకుని. అప్పుడే అమ్మ ఏడుచేపల కథ మొదలు గౌరమ్మ కథ దాకా ఏవేవో కథలు చెప్పేది. ప్చ్...

చెమటని తుడుచుకోవాలని కూడ అన్పించలేదు చంద్రిక్కి.

తల్లి మాటిమాటికీ దోమల్ని చంపుతోన్న చప్పుడే భరించరానిదిగా వుంటే దూరంగా కీచురాళ్ళతో కలిసి గుడ్లగూబ వికారంగా అరవడం మరింత దడ పుట్టించింది. దానికి తోడు అక్క కొడుకు రమేషు ఉక్కపోతకి తట్టుకోలేక విసుగుపడ్తూ మూలుగుతున్నాడు.

"యామ్మే... నిదరబట్టల్యా. ఈ సాలంతా మునిగిపోయినట్టుగా దిగులుగా వుంటావు. ఏంది నీ ఆలోసిన. నాకు చెప్పేమి..." తల్లి లేచికూర్చుంది చంద్రికని అనునయిస్తూ.

తాము వుంటోన్న ఈ సాల మునిగిపోవడమే జీవితమంత సమస్య తల్లికి. చంద్రిక్కి నిజంగానే ఈ సాల మునిగిపోతే బావుండునన్పించింది.

రెండు చాపలు కూడా పూర్తిగా పట్టని ఈ గుడిసె... రెండడుగుల వెడల్పు లేని వాకిట్లోని సాల... వుండడంకన్నా మునిగిపోవడమే మేలుకదా. ఆ మాటంటే తెల్లారలేదని కూడ చూడకుండా తల్లి చీపురుకట్టెత్తుకుంటుంది.

తల్లి మాటకు జవాబు చెప్పకుండా ముక్కెగబీలుస్తూ చీపురెత్తుకుని తలుపు తీసుకుని వాకిట్లోకొచ్చి నిలబడింది చంద్రిక.

చల్లటిగాలితో చుట్టేస్తూ వేపచెట్టు ప్రేమగా పలకరించింది.

నులక మంచం మీద వెల్లకిలా పడుకుని గురకలు పెడుతోన్న చంద్రిక తండ్రి కిర్రుమన్న తలుపు చప్పుడుతో విసుగ్గా ఒత్తిగిలి పక్కకి తిరిగి పడుకున్నాడు.

'ఎట్ట బతకాల... ఎట్ట పైకి రావాల' అన్న ధ్యాసే లేకుండా ఈ మనిషికి యింత మొద్దు నిద్దరెట్టొస్తోందో.

వాకిట్లో ఒక మూల నుండి టెంకాయపుల్లల కట్టతో బరబరా చిమ్మడం మొదలు పెట్టింది చంద్రిక. తండ్రికి నిద్రాభంగ మవ్వాలన్న ఆలోచనతోనే.

అప్పుడే మెలకువొచ్చినట్లుగా గొంతెత్తి కూసింది కోడి.

✦ ✦ ✦

"విత్తువానికి విత్తనమును, తినుటకు ఆహారమును దయచేయు దేవుడు. మీకు విత్తనము దయచేసి విస్తరింపచేసి మీరు ప్రతి విషయంలో పూర్ణౌధార్యభాగ్యము గల వారగునట్లు మీ నీతిఫలము వృద్ధి పొందించును..." వేపచెట్టు కింద కూర్చొని బైబిలు చదువుతుండగా ఎగిరొచ్చి పడిందది. సూటిగా వచ్చి ఎదమీద తగిలి ఎగిరి కిందపడింది కోడుంబిళ్ళ. కొంచెం అయితే కన్ను పోవాల్సిన మాట.

చురుక్కుమని, ఝల్లుమంటోన్న గుండెని అదుపులో పెట్టుకుంటూ 'ఎవురా?' అని తలెత్తి చూస్తే... మూడిళ్ళ కవతలుండే జనార్ధన్. అరుంధతీయవాడలో అంతా 'జనా' అని పిలుస్తారు వాణ్ణి.

'సినిమా ఈరోన్లాగుండావే... భలే తీర్నావు" కన్ను గీటుతూ వాడు కోడుంబిళ్ళ పట్టుకెళ్ళాడు. ఆ పోవడం అప్పటిదాకా చంద్రిక ఉతికిఆరేసిన గుడ్డల దండాన్ని తెంపు కుంటూపోయాడు. మొత్తం గుడ్డలన్నీ జారి కిందపడ్డాయి.

నిరుత్తరురాలై చూస్తోంది చంద్రిక.

చాలాసేపటిదాకా ఆమె బుర్ర పాటుకి రాలేదు.

ఏమనుకుంటుండారు వీళ్ళంతా?

నిన్నటికి నిన్న చెల్లెల్ని లేపుకుపోయిన ప్రసాదుగాడు... తను అమ్మానాయినికి అన్నమెత్తుకు పోతూ అడవి దారిలో వుంటే చెరుకుతోట కాడ నిలేసి "భలే గుండావే. రెండునెల్ల ముందుగానైతే మీ చెల్లిని గాకుండా నిన్నే లేపుకు పొయ్యుందునే..." వెకిలి వెకిలిగా నవ్వుతూ చెయ్యి పట్టుకోబోయాడు.

పక్కింటి రవణమ్మ, ఎదిరింట్లో కొండమ్మ, ధనమ్మ, సారమ్మ... సావాసగత్తెలంతా యిదే మాట.

"భలే వుండావు... భలే వుండావు... అందంగా" అని.

రెండో బావ గుండక్క భర్త చినన్నపేట నుండొచ్చాడు చూడ్డానికి "మీ అక్కని తీసుకొచ్చి వదిలిపెట్టి పోతా. నీలాగే తీర్చిచ్చు" అన్నాడు నవ్వుతా. తల పట్టుకుంది చంద్రిక.

ఈ స్టైయిలు, ఈ అందం, ఈ మాటతీరు, అభిమానం... ఎవురే చిన్న మాటన్నా పడకపోవడం యివన్నీకూడా అరుణక్కని చూసి నేర్చుకున్నవే. ప్రార్ధన కూడా అరుణక్కే నేర్పించింది.

ప్రతివారం చర్చికి తీసుకెళ్ళేది. మెల్లిమెల్లిగా బైబిలు చదవడంకూడా నేర్పింది.

ఆ మాటకొస్తే తన పేరు చంద్రికగా మార్చిందికూడా అరుణక్కే.

తన కూతుళ్ళు మౌనిక, తూలికలతోపాటు తన పేరు చంద్రికగా మార్చింది. అసలంతకు ముందు తనకో పేరుండేదా? 'నడిపమ్మి' అని పిల్చేవాళ్ళు అమ్మా, నాయినా.

అరుణక్క తన కూతుళ్ళకేది పెడితే అదే తనకీ పెట్టేది. వాళ్ళతోపాటే ప్రతిచోటికీ తీసుకెళ్ళేది.

అరుణక్క చాలా నేర్పించింది. తను కూడా ఒక మనిషేనన్న సంగతి అరుణక్క వద్దే నేర్చుకుంది. అయినా ఎక్కడో ఏదో చిన్న మెలిక. ఎంతో బాగ చూసుకునే అరుణక్క... ఎన్నెన్నో విషయాలు తెలిసిన అరుణక్క... ఎన్నో పుస్తకాలు చదివిన అరుణక్క కూడా ఎందుకో తను నిలబడి మనిషిలా మాట్లాడబోతే సహించలేక పోయేది. తగ్గే వుండమనేది.

అమ్మనీ, నాయిన్నీ చూడాలంటే యాడాదికొక్కసారి కూడా యింటికి పంపేది కాదు.

ఆలోచనలతోనే జనాగాడు కింద తోసిపోయిన గుడ్డలన్నింటినీ తిట్టుకుంటూ, తిట్టుకుంటూ మళ్ళీ బక్కెట్లో వేసి నీళ్ళతీసి ఒక్కొక్కటీ ఆరేసింది. రమేషుగాడి చొక్కా నిక్కరూ ఆరేస్తూ పెద్దక్కని తిట్టుకుంది. కొడుకుని కని అమ్మానాయినా ఎదాన దోసి ఊళ్ళు పట్టిపోయినందుకు నసుక్కుంది.

తెల్లారిలేచి వాళ్ళు అడవికెళ్ళిపోతే అవతల ఎన్ని పనులుంటాయి?

పశువులకాడ పేడ జవిరి శుభ్రం చేసి, పిల్లోడ్ని రెడీ చేసి బడి కంపించి... గుడ్డలుతికారేసి అప్పటికి ఖాళీ అయిన తొట్టిని మళ్ళీ నింపుకుని... అన్నం కూరా వండి అమ్మా, నాయినికి అడవికెత్తుకు పోవాల.

పొయ్యిమంటేసే అలవాటు తప్పిపోయింది చంద్రికకి. ఆదిమానవుడు నిప్పు రాజేసినంత యజ్ఞమయిపోతోంది చంద్రిక్కి. పొయ్యి మంటేసి అన్నమూ, కూరా వొండడం.

అరుణక్కోళ్ళింట్లో లైటరు కూడా అవసరం లేకుండా స్విచ్చులు తిప్పితే చాలు మంటొచ్చేస్తాది. ఈసారి డబ్బులొస్తే 'గ్యాస్ స్టౌ' కొనుక్కోవాలనుకుంది చంద్రిక. దీపం పథకం కిందొచ్చిన సిలిండర్ని అమ్మేసినందుకు నాయిన్ని తిట్టుకుంది.

చంద్రిక ఆలోచనలు ఒక దారీ, దరీ లేకుండా సాగుతూనే వున్నాయి.

అరుణక్క సంవత్సరానికి మూడువేలా అయిదొందలిస్తాది. మొదట్లో అంతిచ్చేది కాదు. మూడేళ్ళ డబ్బులు తెచ్చి పెద్దక్క పెళ్ళి చేసినాడు నాయిన. ఆయమ్మి సంవత్సరం కూడ కాపరం చెయికుండా కొడుకు నెత్తుకుని వచ్చేసింది. మరో మూడేళ్ళ డబ్బులు తెచ్చి గుండక్క పెళ్ళి చేసినాడు. ఆయమ్మి పెళ్ళయి రెండేళ్ళయినా కడుపు పండలేదని మొగుడూ, అత్తా చిటపటలాడుతుండారు.

వుండేవన్నీ వుండంగా చినమ్మి (చెల్లి)ని ప్రసాదు లేపుకుపోయినాడు. ఆయమ్మి యింట్లో వుంటే అమ్మా, నాయినికి ఆదరువుగా వుండేది.

అన్నం వొండి అడివికెత్తుకుపొయ్యేది.

ఎండా, గాలీ లేకుండా గొడ్లను మలేసేది. అడివంటే లెక్కేలేదు ఆయమ్మికి. ఏం ముసించిందో వాడితో పడిపోయింది. యింత లోపల పెళ్ళి కావల్సొచ్చింది దానికి.

ఆరేసిన గుడ్డలు ఒక్కొక్కటీ జారిపోతూంటే వాటికి పెట్టడానికి క్లిప్పులు లేనందుకు చింతపోయింది.

'తల్లిదండ్రుల చేతను... సహోదరుల చేతను, స్నేహితుల చేతను, బంధువుల చేతను మీరు అప్పగింపబడుదురు... వారు మీలో కొందరిని చంపింతురు..."

ఆ తర్వాత యిక బైబిలు మీద మనసు నిలవలేదు చంద్రిక్కి.

నాయిన కసలు బైబిలు చదవడం యిష్టముండదు.

"మన కులం మనకి గొప్ప. మాదిగోళ్ళం మాదిగోళ్ళమని చెప్పుకోక మరేమని చెప్పుకోవాల. క్రీస్తుల్లో చేరాలంటావేందిమే. అదొక జంబమా?" అంటాడు కసురుకుంటా.

గుడ్డలు రెండోసారి ఉతకడంతో తక్కువపడ్డ నీళ్ళతొట్టిని నింపడానికి బిందెత్తుకోని బోరింగు కాడికి బయల్దేరింది.

పంచాయితీ కాలవలో నుండి రొచ్చువాసన ఘాటుగా వచ్చి వాడని చుట్టేస్తోంది. అడవికి పోకుండా కొట్టంలో కట్టేసివున్న దూడలు రెండూ వుండుండీ అరుస్తున్నాయి తల్లుల కోసం కాబోలు.

✦ ✦ ✦

మధ్యాహ్నం రెండు కావస్తూంది. నవంబరు నెల కావడంతో ఎండ అంత తీవ్రంగా లేదు.

నువ్వుచేన్లో నుండి అన్నంగంప నెత్తిన పెట్టుకుని గెనాలమీద నడుస్తూంటే వేయించిన నువ్వులు చిమ్మిరి కొడుతున్నప్పటి వాసన. పచ్చిమట్టితో కలగలిపి ఒక కొత్తరకం వాసనేదో చంద్రిక ముక్కుపుటాలను తాకింది. మొన్న గడ్డి కోసుకురాను పోయినపుడు అరికాల్లో దిగిన ముల్లు యింతదాకా తీయించుకోనే లేదు. చీము పట్టి నట్టుంది. నడుస్తూంటే తాతలు కన్పింస్తుండారు.

దారీ, డొంకా లేని వూరు. మిట్టలూ, పల్లాలూ, గుంటలూ, గోతులూ గెనాలమీద గడ్డిలో నడవడం... ఆ గుబుర్లో ఏ మూలనుండి ఏ పామొచ్చి కాటేస్తుందోనని భయం.

ఆ మాటంటే 'ఆకాశం నుండి దిగొచ్చినట్టు మాట్లాడబాక, చిన్నప్పుడు ఈ గెట్ల మీద నుండే కదా కండ్రిగ నుంచి బిందెలు బిందెలు నీళ్ళు మోసేదానివి. వానాకాలంలో అయితే యిక్కడ అడుగేస్తే అక్కడికి జారేది. మర్చిపోయావా? ఈ అడుసుకయ్యల్లోనే గదంటమ్మే నువ్వు నాట్లేసిందీ కలుపుతీసిందీ... పాటలు పాడిందీ...' అంటారు సాదుస గత్తెలు.

నిజమే, తను గొంతెత్తితే చాలు టెంకాయచెట్టు మీద వాలిన రామచిలుకలు వంతపాడేవి. స్నేహితురాళ్ళంతా కయ్యలో దిగితే చాలు తనని పాడమని, పాడమని తొందరచేసేవాళ్ళు గొంతు బాగుంటుందని.

అయితే యిప్పుడెందుకీ గెనాలు, గెడ్డీగాదం... ముళ్ళపొదలూ యింత చిరాకు కల్గిస్తున్నాయి.

చంద్రిక్కి చప్పున తను అరుణక్కోళ్ళతో కలిసి కార్లో ప్రయాణించే నున్నటి వెడల్పాటి తారురోడ్లు గుర్తొచ్చాయి.

నిగనిగలాడుతూ కొండచిలవల్లా ఎండకి మెరిసిపోతూ వుంటాయి తళతళా. రాత్రుళ్ళయితే మిరుమిట్లు గొలిపే లైట్ల వెలుతురికి మరీమరీ మెరుస్తూంటాయి రోడ్లు. వాటి మీద కార్లు నున్నగా జారిపోతూంటాయి.

గూడు బండెక్కి మిట్టపల్లాలు దాటుకుంటూ పేటకు పొయ్యేప్పుడు లాగలేక లాగలేక లాగే ఒంటెద్దు తనకి చాలాసార్లు గుర్తోచ్చేది.

ఆ తారురోడ్డు మీద ఎ.సి. కార్లో పోతూన్నపుడు... అక్కడున్నప్పుడు అమ్మా, నాయినా... పొలమూ, పుట్రా యిల్లూ వాకిలీ... సావాసకత్తెలూ అంతా పదేపదే గుర్తొచ్చే వాళ్ళు చంద్రిక్కి. మిగిలిన అప్పచెల్లెళ్ళ మీద అంత భ్రమలేదుగానీ గుండక్క మాత్రం అప్పుడప్పుడూ గుర్తుకొచ్చేది. చూడాలని కూడ బాగ అన్పించేది.

మళ్ళీ ఈడకొచ్చింది మొదలూ అరుణక్క... అందంగా అమిర్చినట్టుండే వాళ్ళ యిల్లూ... పిల్లలూ... మంచి సంగీతంతోనూ, వచ్చిపోయే కస్టమర్లతోనూ నిండి వుండే కుట్టు సెంటరూ... సెంటరు కొచ్చినపుడల్లా తనతో మాట్లాడ్డమే కాకుండా తనకి ప్రత్యేకంగా డబ్బులిచ్చిపోయే ప్రభక్కా... అరుణక్క భర్తకోసం వచ్చిపోయే పెద్దపెద్ద ఆఫీసర్లూ... ఆదివారం ఆదివారం వెళ్ళే విశాలమైన ప్రార్థనామందిరమూ అన్నీ మళ్ళీమళ్ళీ గుర్తొస్తున్నాయి.

కళ్ళముందు పరుచుకున్న రెండు ప్రపంచాల్లో ఇటుకాసేపు, అటుకాసేపు ఊగిసలాడుతోంది చంద్రిక.

అరుణక్క తనకి తిన్నంత అన్నం పెట్టేది. కట్టుకున్న గుడ్డ యిచ్చేది. వాళ్ళ చెల్లెలువి ఎన్నో డ్రస్సులిచ్చేది. అవేసుకుని కుట్టుసెంటర్లో తిరుగుతూంటే అరుణక్క చెల్లెలే అనుకునేవాళ్ళు వొచ్చినోళ్ళంతా. అంతా బాగానే వుండేది.

'మరెందుకొచ్చేసినావుమే' అనడుగుతుంది సారమ్మ.

అవును తనెందుకొచ్చేసింది... గాలి మళ్ళింది.

'అక్కడుంటే ఎన్నాళ్ళయినా యింతే ఎదుగూబొదుగూ లేకుండా అన్పించింది. నాకూ వాళ్ళ మాదిరి యిల్లు కట్టుకోవాలని వుంది. ఆ యింట్లోకి కుర్చీలు, టేబులూ, గ్యాస్ స్టౌ... నాలుగు వస్తువులూ కొనుక్కోవాలని వుంది. ఇవన్నీ మనం మాత్రం ఎందుకు కొనుక్కోగూడదు... మనం మాత్రం వాళ్ళ మాదిరిగా ఎందుకనుభవించగూడదు.

అట్టని యాడయినా రాసుందా?

చంద్రిక మాటలు విని స్నేహితురాళ్ళంతా పకపక నవ్వుతారు.

అరుణక్క అప్పుడప్పుడూ పెట్టుకుని వినే బిజినెస్ క్యాసెట్లో ఒకాయన ఒక మాటంటాడు.

'పేదవాడుగా పుట్టిన ప్రతివాడూ పేదవాడుగా మరణించాల్సినవసరం లేదు,' అని.

ఆ మాట విన్నప్పుడల్లా తనకి హుషారుగా, ఉద్వేగంగా వుండేది. ఇప్పుడా మాట చెపితే స్నేహితురాళ్ళు మరీమరీ నవ్వుతారని మానుకుంది.

ఏదో ఒకటి చెయ్యాలి.

చంద్రికకి ఏదో చేయాలని వుంది. ఎవరి మీదనో కోపంగా వుంది. ఎవరితోనో పోట్లాడాలని వుంది. ఆ యుద్ధం ఎవరి మీదనో అర్థం కాకుండానూ వుంది.

పరస్పర విరుద్ధమయిన రెండు జీవితాల మధ్య... రెండు ప్రపంచాల మధ్య జరిగే సంఘర్షణలు... మనుషులంతా ఒకటే అయినప్పుడు అందరూ ఒకేవిధంగా ఎందుకు బతకగూడదు అన్న సంఘర్షణ. మరి ఈ సంఘర్షణకి అంతం లేదా? రెండింటి మధ్యా రాజీ లేదా?

సాగి సాగి చిక్కుబడిపోతున్న ఆలోచనల నుండి తేరుకోవడం సాధ్యంకావడం లేదు చంద్రికకి.

ఇవన్నీగాని తెలిస్తే అమ్మా, నాయన తనని చితకబాదుతారు.

లేదా

"మంచం వున్నంతవరకే కాళ్ళు చాపుకోవాలమ్మే... లేని దానికి వొగిసేద్దేనికి... ఉన్నదాంతో ఊరుకోవాల. ఉండే వాళ్ళంతా గాన బంగారు తింటుండారా... కూడే కద తింటుండారు. నీకెందుకు పుట్టిందిట్టాటి బుద్ధి. ఇప్పుడు వాడలో కుర్ర పిలకాయలంతా కూడ యిట్నే మాట్లాడ్తుండారు కొంతమంది.. ఏంపొయ్యే కాలాలోయియ్యి..." అంటూ నెత్తికొట్టుకుంటారు. ప్చ్...

చంద్రిక్కెందుకో ఏడుపొచ్చింది.

తనకేం కావాలో... లేదా ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు.

తపనగా వుంది. ఆలోచనల్తోనే నడిచి నడిచి అడవికొచ్చింది .

"యామ్మే యింత ఎండబడింది?" అన్నది తల్లి గంప దించుతూ.

"కొండమ్మతో పల్లంచి ఆడతా మర్చిపోయాను" అని చెప్పలేదు చంద్రిక.

నిజానికి చంద్రిక్కి ఆమాదిరిగా రోజంతా వృథాగా గడపడం యిష్టంలేదు.

పని లేకుండా ఖాళీగా వుంటే మనుషులేమయిపోతారోనని భయం. ఈ మాట అరుణక్క పదేపదే అంటుండేది.

ఏందో పుట్టి పెరిగిన ఊరు... అమ్మా నాయినా వుండారని భ్రమపడిందేగాని మళ్ళీ వచ్చినప్పట్నుండీ ఎందుకొచ్చినామా? ఎప్పుడెప్పుడీడ్నుండి బయటపడదామా అన్పిస్తోంది.

ఊరు కూడా యింతకు ముందులాగ లేదు. ఏవేవో గొడవలు లోపల్లోపల. ఊరోళ్ళకీ, వాడోళ్ళకీ మధ్యన గొడవలు. ఊళ్ళో రెడ్లకీ, నాయుళ్ళకీ నడమ గొడవలు. వాడలో మాలోళ్ళకీ, మాదిగోళ్ళకీ మధ్యన గొడవలు. అసలు మనిషికీ మనిషికీ మధ్య కూడ యుద్ధమే. మేం గొప్పంటే... మేం గొప్ప. కొట్టుకోవడానికీ, చంపుకోవడానికీ కూడ వెనకాడ్డంలేదు.

"యాం కూరమే అదా?" నాయినికి ముద్దబెట్టి కూరేసి అందిస్తున్నా ఆలోచనలు మాత్రం ఆగలేదు చంద్రిక్కి.

కాలవలో మొహం కాళ్ళచేతులు కడుక్కుని ఆ ముతక చీరతో తుడుచుకుంటూ వచ్చింది సుబ్బమ్మ.

కూతురు సమాధాన మివ్వకపోయేటప్పటికి లోలోపలే ఏదో గొణుక్కుంటూ ముద్ద తుంచసాగాడు రాగయ్య.

✦ ✦ ✦

"ఎందుకు చేర్చినావంటే ఏం చెప్పేదిమే. మాలోళ్ళ తిరపాలుగాడి గొర్రెలు పోయినపుడు మీ నాయినే దొంగతనం చేసినాడని కేసు పెడితిరి. గాలోళ్ళ బాలకిష్టడికీ, మీ నాయినకీ మాటా మాటా వచ్చి మీ నాయన చొక్కాపట్టుకున్నాడోడు.

చొక్కా పట్టుకుంటే మీ నాయిన గమ్మునుంటాడా?

నీకు దేనికిరా మద్దిన? అన్జెప్పి యిసిరిపిచ్చి ఒకటేసినాడు. అంతే, ఆ ఒంటూ పిరోడికి అంతకుముందే గుండాల్ట్ వుండే. ఆ దెబ్బతో గూడ ఊపిరొదిలేసినాడు.

గొర్రెల కేసుపోయి ఖూనీ కేసొచ్చేసె మీ నాయినమీద, అందరం వొణికిపోతిమి. ఏడుపు లారుపులుగా కండిగ అర్నాధయ్య దగ్గరికి పరిగిస్తే... ఆయన చెప్పె...

"పేటకి కొత్తగా వచ్చిన సి.ఐ. కూతురు నెల్లూర్లో వుండాది. ఆడకి పనిపిల్ల గావాలంట. నీ దగ్గిర ఒకరికి నలుగురుండారుగదా ఒకర్ని పంపించు. ఈ కేసు గీసు కూడా ఆయనే చూసుకుంటాడ్లే' అని.

అప్పటికే పెద్దమ్మి పెద్దమనిషయ్యుండాది.

ఆయమ్మిని ఎట్లే యింత దూరం పంపించేది అనుకుంటిమి. గుండమ్మి కూలి పనికి పోయి పది రూపాయలు తెస్తుండె. అదీకాక పోనంటే పోనని మొండికేసింది. చిన్నమ్మి మరీ చిన్నదయిపాయ. ఇహ నుండేది నువ్వు. నువ్వు కూడ పోనంటే పోనన్నావు.

మీ నాయిన ఖూనీ కేసులో నుండి బయటపడాలంటే నువ్వు పోవాల పనికి. ఈ కేసట్ట అయిపోతే మళ్ళొచ్చేద్దువులే అని చెప్పి పంపినాము. ఎట్నో నువ్వాడ్నే అతికి పోయినావు. వాళ్ళకీ నీకూ కుదిరిపోయింది."

"హె... హె... హెయి... హెయి..." మామిడితోపువైపు పరిగెడుతూన్న తోకలేని బర్రెని మలెయ్యాలని చెప్పి చెప్పకుండా పరిగెత్తింది సుబ్బమ్మ.

'హు... తను అతికిపోయిందా?'

ఎన్ని రాత్రిళ్ళు... నాయిన్ని పోలీసులు పట్టకపోయినారేమో... జైల్లో పెట్టినారేమో... ఉరి తీస్తారేమో అని అల్లాడిపోయింది.

అమ్మ పక్కన పడుకోవాలని ఏడ్చుకుంది. అక్కచెల్లెళ్ళతో వుండాలని తపన పడింది.

వాళ్ళ మాటలూ, వాళ్ళింట్లోని పనులూ ఎంతకీ అర్థమయ్యేవికాదు. సంవత్సరం దాకా ఎవరూ కనపళ్ళేదు యింట్లో వాళ్ళు.

అమ్మ మీద కోపమొచ్చేది. చేశాడో, లేదో తెలీని నాయిన గొర్రెల దొంగతనంమీద ఒళ్ళు మండుకొచ్చేది. నాయిన్ని కాపాడుకోడానికి తను మాత్రమే అందర్ని ఒదులుకోని ఈడుండాలా మిగిలిన కూతుళ్ళకి బాధ్యత లేదా అని గుటకలు పడని దుఃఖాన్ని మింగు కునేది.

తోకలేని బర్రెని మలేసి మళ్ళీ వచ్చింది సుబ్బమ్మ. అది అడివంతా పరిగెత్తించిన రొప్పు యింకా తగ్గలేదామెకి.

"యాంజేస్తాం చెప్పు చెంద్రీ... అక్క చూస్తే అట్టయిపాయ. ఆ గుండమ్మి కాపురం ఏ పొద్దెట్లవతాదోనని మినకతా వుంటే... చెల్లి కొడుకు, చెల్లి కొడుకని ప్రసాదుగాడ్ని తెచ్చి యింట్లో పెట్టుకున్నాడు మీ నాయిన... గుడిసెమీద దెబ్బేసి వాడెంతపని చేసిపాయి నాడో చూడు... మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టు, దానికి దానికి చేసుకుంటున్న సంసారం ఈదినబడిపాయ."

ఆ విశాలమైన అడవిలో తమ మాటలు వినడానికి వేరెవరూ లేరని తెలిసికూడ గుసగుసగా మాట్లాడుతోన్న తల్లికేసి జాలిగా చూసింది చంద్రిక.

ఇప్పటికే ఊరంతా అగుడయిపోయింది. రాగయ్య చిన్నకూతురు మేనబావతో లేచిపొయ్యిందని ఇప్పుడు కొత్తగా ఎవరు వినిపోతారు. చిన్నమ్మే కాదు... తనయినా సరే ఈ ఊళ్ళో వుంటే ఎవరో ఒకరు లేపుకుపోతారు. ఇక్కడెవరూ చదువుకోలేదు. ఎవ్వరికీ జీవితాల పట్ల నిర్దిష్టమైన అభిప్రాయాలు లేవు. పనిచేసి పైకి రావాలన్న ఆలోచనలు లేవు.

"ఇప్పుడాయమ్మి గాన ఆ పని చేసుండకపోతే నిన్ను తోడకొచ్చే వుండం. ఆ పెద్దమ్మి వుంటే దేనికయినా ఆదరవా? నిన్నూ, నీ కొడుకునీ సాకతుండాం కదా ఈ పశువులకాడి కట్టబోమే అంటే యింటాదా? కూలికి పోవాల అంటాది. అట్టయినా ఆ యమ్మి నిజంగా పనికిపోతుండాదా అంటే మొన్న ఆ మాలోళ్ళ చెంగడితో వుణ్ణిందని వాడి పెళ్ళామొచ్చి దుమ్మెత్తిపోసి అట్టా మాట్లాడిపొయ్యింది. దేనికని పడేది చెప్పు. వాడలో పరువు, యిలువ అనేదే ల్యాకుండా పాయా..." ఎడంచేత్తో చీరకొంగు తీసి కళ్ళు తుడుచుకుంటూ దూరంగా మొగుడు 'సిమ్రాని' దూడని తరుముకుంటూ యిట్ల రావడం చూసి ఏడుపాపేసింది సుబ్బమ్మ.

పీత కష్టాలు పీతవి... నవ్వూ, దిగులూ కమ్ముకున్నాయి చంద్రికను.

నాయిన ముందు పెదమ్మి మాట, చిన్నమ్మి మాట ఎత్తడానికి లేదు.

"నా కడుపున చెడపుట్టారు" అంటాడు.

మళ్ళీ మనవడంటే ప్రాణం. అదేందో... ఇదేందో ఎంతాలోచించినా అర్థంకాదు చంద్రిక్కి.

సిమ్రాని దూడను తోలుకొచ్చి మందలో తోలి కాలవలో మొహం కడుక్కుని జమ్మిచెట్టు నీడలో కూర్చున్నాడు రాగయ్య.

"ఆ ఒక్కదినం గాన వాన రాకుండా వుణ్ణా కూటు గట్టేసుంటుం... ముదనష్టపు వాన మనకోసమే వచ్చినట్టుండాది. పొడుగు లేసినోళ్ళు కొంత బయటపడి పోయినారి. బుడ్డలేసినోళ్ళు మరీ ఎందుక్కాకుండా పోయినారు. జల్లన రాలిపాయినాయి చేలోనే. ప్చ్... అరెకరాలో మూడునెలలు రెక్కలు ముక్కలు చేసుకుని పెంచిన పైరు నోటికాడికి రాకుండా పోయిందే అని దిగులు గుబులు పడ్తుంటాడు రాగయ్య.

దినానికి పదిసార్లు ఆ మాట అనుకుంటానే వుంటాడు.

వడ్లల్లో పొడుగులు, బుడ్డలు అన్న రకాలుంటాయన్న సంగతే చంద్రిక్కి గుర్తు లేదు. జిలకర మసూరి, మొలగొలుకులు మాత్రమే తెలుసునిప్పుడు.

ముతక చీరతో ఎండనబడి పశువులు గాస్తోన్న తల్లినీ, నీరుకావి పంచెతో భుజాన పైగుడ్డ కూడ ల్యాకుండా బక్కపేగుల్ని బయటేసి చెట్టుకింద కూర్చుని గొణుక్కుంటోన్న తండ్రినీ చూస్తుంటే మళ్ళీ ఆలోచన రేగింది చంద్రిక కడుపులో. ఆలోచనతోనే వచ్చి నాయిన పక్కనే కూర్చుంది.

"నాయినా కంద్రిగ హర్నాదయ్యతో జెప్పి పేట్లో యింటి స్థలం యిప్పించుకో గూడదా... ఎవురయినా అడిగితేనే గద చేస్తారు" మెల్లిగా కదిపింది.

ఏ కళనున్నాడోగాని రాగయ్య,

"ప్యాట్లో (పేటలో) మనకెవురు తెలుసు చెప్పు? అరుణమ్మోళ్ళ నాయిన గూడ యిప్పుడు ప్యాట్లో లేడు. హరినాధయ్యతో రెండు, మూడుసార్లు ఎచ్చరించినా. 'నీ కీడ స్థలముండాది గద రాగయ్యా... నీ పెద్దకూతురి పేరుతో రాయిస్తాలే' అన్నాడు. అట్నే పెద్దమ్మి పేరు రాయించినా. ఇదిగో అదిగో అంటుండారు. ఏదయినా మన చేతుల్లోకి వచ్చేదాకా నిజంగాదమ్మో! ప్రభుత్వం పేదోళ్ళకోసం అది చేస్తుండాది... యిది చేస్తుండాది అంటుండారు. యాడ చేస్తుందో యాం చేస్తుండాదో మనకి తెలీదు. ప్చ్..." బీడీముక్కని చివరిదాకా పీల్చి విసుగ్గా కాలవలోకి విసిరాడు రాగయ్య.

కుట్టుసెంటరు పెట్టుకోవాలన్నా కూడ పేట్లో అయితేనే కొంచెం బాగుంటాది. అట్ట సెంటరు పెట్టాలన్నా కూడ తనకి పని పూర్తిగా రాదు. మిషను కుడ్తాదేగానీ కటింగంతా అరుణక్క చేసిస్తాది. చీరలకి పూలు కుడ్తాదేగానీ డిజైన్లన్నీ అరుణక్క వేసిస్తాది. ఇంకా కొన్ని కొన్ని నేర్చుకోవాల్సి వుంది.

దానికయినా పదివేలు పెట్టుబడి కావాలి. మిషనొకటి కొనుక్కోవాలి.

మళ్ళీ అరుణక్క దగ్గిరకే పోదామా అనుకుంది.

ప్రభక్క 'సంవత్సరానికి అయిదువేలిస్తాను మా యింటికొచ్చేయి' అన్నది.

ఎక్కడికి పోవాలన్నా నాయిన ఒప్పుకునేట్టు లేదు. ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా పెళ్ళి చేసేయాలని సంబంధాలు చూస్తుండాడు. తనకిప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు. తన పెళ్ళిచేసి ఆ అప్పు తీర్చడం కోసం మళ్ళీ అమ్మా, నాయినా ఎండా మంటలో పోరుకాడాల.

అప్పు లేకుండా దేంట్లోనో ఒకదాంట్లో స్థిరపడాల.

పడి పడి... పడీ... తన అంతరంగ ఘర్షణకు మూలమేదో బోధపడ్డట్టుగా మౌనంగా వుండిపోయింది చంద్రిక.

✦ ✦ ✦

మౌనపోరాటం పరిసమాప్తి అయినట్లుగా 'కుహూ కుహూ'మంటూ కోయిల కూయడం మొదలుపెట్టింది. ప్రతి కొమ్మా చిన్నవో, పెద్దవో చిగుర్లు తొడిగింది. ఆ చిగుర్లను నములుతూ కోయిల మరింత గొంతును సవరించుకుంటోంది.

గుక్క తిప్పుకోనివ్వని ఉక్కపోతలో నుండి దిగ్గున లేచి కూర్చుంది సుబ్బమ్మ. దోమల మోతకి మనవడు మూలుగుతూనే వున్నాడు. గుడ్డి వెల్తురులోనే పక్కన చంద్రిక లేకపోవడాన్ని, ఓరగా తలుపువేసి వుండడాన్ని గమనించి గుండె ఝల్లుమనింది. వెంటనే మళ్ళీ 'ఒంటిగ్గాన పొయ్యిందేమోలే' అని సరిపెట్టుకుంది.

క్షణంసేపు మాగన్నుగా ఒరిగి... మళ్ళీ లేచి కూర్చుని చూసింది.

ఎంతసేపటికీ చంద్రిక వస్తోన్న జాడ లేకపోయేటప్పటికి లేచి తడుముకుంటూ వెళ్ళి తలుపు బార్లా తెరిచింది.

వేకువ వెలుతురులో చంద్రిక లేదు... చెప్పుల్లేవు.

లోనికొచ్చి గుడ్డిదీపం వెలిగించి చూస్తే చంద్రిక బ్యాగూ లేదు.

అరికాళ్ళల్లో నుండి దడ పుట్టింది సుబ్బమ్మకి.

మొగుడికీ, లోకానికీ ఏం చెప్పాలో తెలీక ఏడుస్తొందేకానీ సుబ్బమ్మకి లోలోపల ఖచ్చితంగా తెలుసు... కూతురు తెలివితక్కువది కాదనీ... ఎవరితోనూ లేచిపొయ్యుండదనీ.

అయితే కూతురు దేనికోసం యాతనపడింది?

దేన్ని వొదిలించుకోవాలని కలలు కనింది? దేనికోసం వెతుక్కుంటూ వెళ్ళింది. ఆలోచించేకొద్దీ అర్థంకానితనం వెక్కిరిస్తూనే వుందామెని.

చీకటి కనుపాపను పెద్దది చేస్తుంది.

అందీ అందని జ్ఞానం అన్వేషణకు బీజం వేస్తుందని తెలీదు సుబ్బమ్మకి. అప్పటికి కోడి కూసింది కొంచెం ముందుగానే.

వేపచెట్టు ఆకులమీద తొలిసంధ్య కిరణాలు పడి దోబూచులాడుతున్నట్టుగా వుంది.

పైకి ఒకటిగానే కనిపించే ప్రపంచం రెండుగా చీలి ఒకదానితో మరొకటి రాజీలేని యుద్ధం చేస్తున్నట్లుగా వుంది.

*అరుణతార మాసపత్రిక*
*జూన్-జూలై, 2005*